క్లుప్తంగా

బీజేపీ టికెట్ కేటాయించాలని వినతి



ఎంపీ లక్ష్మణ్‌కు వినతి పత్రం ఇస్తున్న నాగరాజు

మానకొండూర్: బీజేపీ మానకొండూర్ నియోజవర్గ అసెంబ్లీ టికెట్ తనకు కేటాయించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు కోరారు. శనివారం ఉత్తరప్రదేశ్ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్‌ను హైదరాబాద్‌లో కలిసి, వినతిపత్రం అందజేశారు. తాను నియోజవర్గంలో పార్టీ తరఫున అనేక కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. పేద ప్రజలకు బియ్యం అందించడంతోపాటు ఆర్థికంగా ఆదుకున్నానని పేర్కొన్నారు. టికెట్ కేటాయిస్తే విజయం సాధిస్తానని తెలిపారు.

మాజీ ఎంపీ పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎంపీ ప్రభాకర్

చిగురుమామిడి: మండలంలో ఇటీవల మృతి చెందినవారి కుటుంబాలను మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ శనివారం పరామర్శించారు. సుందరగిరి, చిగురుమామిడి, లంబాడిపల్లి, చిన్నముల్కనూర్ గ్రామాలకు చెందిన కక్కెర్ల అనసూర్య, గంగుల వెంకటయ్య, బండారుపల్లి వీరస్వామి, గజ్జల భాస్కర్‌ల మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఓరుగంటి భారతీదేవి తదితరులున్నారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

శంకరపట్నం: మండలం కేంద్రంలోని పీహెచ్‌సీని శనివారం జిల్లా వైద్యాధికారి లలితాదేవి తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రోగుల పేర్ల నమోదును పరిశీలించారు. ఆస్పత్రి రికార్డులు చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎంఎస్‌ఎఫ్ హుజూరాబాద్ ఇన్‌చార్జిగా మహేశ్



మహేశ్

ఇల్లందకుంట: ఎంఎస్‌ఎఫ్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన గంగారపు మహేశ్‌ను నియమించినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కోడెపాక సారంగం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడితోపాటు నాయకులకు మహేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

గుడుంబా పట్టివేత

సైదాపూర్: వెన్నంపల్లిలో గుడుంబా విక్రయిస్తున్న మాడ రాజిరెడ్డి, అతనికి సరఫరా చేస్తున్న వీరా నాయక్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆరోగ్యం తెలిపారు. హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుడుంబా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు పేర్కొన్నారు. శనివారం వెన్నంపల్లిలో రాజిరెడ్డి వద్ద 5 లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు తెలిపారు. అతనికి నల్లాని తండాకు చెందిన వీరా నాయక్ గుడుంబా సరఫరా చేస్తున్నాడన్నారు. గుడుంబా తయారు చేసినా, బెల్టుషాపులు నిర్వహించినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



ప్లేట్లతో విద్యార్థులు

శంకరపట్నం: మండలంలోని చింతలపల్లి, ఆముదాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు చింటు, శ్రావణ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ప్లేట్లు పంపిణీ చేశారు. ప్రియాంక జన్మదినం సందర్భంగా 50 ప్లేట్లు అందించనట్లు నిర్వాహకులు సాయిచరణ్, సాగర్, శ్రావణ్ తెలిపారు.

రామడుగులో గ్రామసభ

రామడుగు: వరద కాలువ నుంచి రామడుగు మీదుగా వెళ్లే ఓటి కాలువ నిర్మాణం కోసం భూసేకరణలో భాగంగా శనివారం భూసేకరణాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి రైతుల నుంచి వివరాలను సేకరించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

పండ్ల తోటలు.. 205 ఎకరాలు

- గన్నేరువరం మండలంలో ఈ ఏడాది పెంచడమే లక్ష్యం
- ఉపాధిహామీ పథకం కింద అవకాశం



గుండ్లపల్లిలో సాగు చేసిన జామతోట

గన్నేరువరం: గతంలో గన్నేరువరం మండలంలో మామిడి, బత్తాయి తోటల పెంపకం ఎక్కువగా చేపట్టారు. కానీ, 2003 నుంచి కరువు నేపథ్యంలో వాటి నిర్వహణ భారంగా మారింది. నీటి వసతి కోసం రైతులు రూ.లక్షలు ఖర్చు చేసి, నష్టపోయారు. దీంతో వాటిని కాపాడలేని పరిస్థితుల్లో తొలగించారు. ప్రస్తుతం మండలంలో నీరు పుష్కలంగా ఉండటంతో మళ్లీ తోటల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. అధికారులు కూడా ప్రోత్సహిస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పెంపకానికి ప్రభుత్వం ఏటా అవకాశం కల్పిస్తోంది. ఈ ఏడాది 205 ఎకరాలు లక్ష్యంగా ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ, ఉపాధిహామీ పథకం అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ అందిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో తోటల పెంపకంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఉపాధిహామీ పథకం జాబ్ కార్డు ఉండి, ఐదెకరాల భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు అవకాశం కల్పిస్తున్నారు.

గత ఎనిమిదేళ్లలో ఇదీ పరిస్థితి..

గత ఎనిమిదేళ్లలో మాదాపూర్‌లో 30 ఎకరాల్లో మామిడి, బత్తాయి, గుండ్లపల్లిలో మూడెకరాల్లో జామ, ఖాసీంపేటలో 15 ఎకరాల్లో మామిడి, బత్తాయి తోటలతోపాటు గన్నేరువరం, జంగపల్లి, మైలారం గ్రామాల్లో కలిపి సుమారు 60 ఎకరాల్లో రైతులు తోటలను సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. 2019 నుంచి మిడ్ మానేరు ప్రాజెక్టు ద్వారా నీటి వసతి అందుబాటులోకి రావడంతో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ తరుణంలో నీటికి ఢోకా లేకపోవడంతో తోటల సాగుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. మొక్కల ఖర్చు, సబ్సిడీ, డ్రిప్ తదితరాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఈ తోటలు ఓకే..

ఈ ఏడాది మామిడి, జామ, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్‌పాం, బత్తాయి తోటలకు అవకాశం కల్పించారు. కొబ్బరి చెట్లు(పొలం గట్లపై) పెంచుకోవచ్చని అధికారులు తెలిపారు. తోటల పెంపకానికి ఉత్సాహం ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, ఇతరులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం కల్పించనున్నారు. గుంతలు తీయడానికి, మొక్కల కొనుగోలుతోపాటు వాటిని నాటడానికి, చెట్లు కింద పడిపోకుండా ఉండటానికి ఊతకర్రల ఏర్పాటు ఖర్చులను ఉపాధిహామీ పథకంలో ఇస్తారు. ఏడాదిలో రెండు దఫాలు మందులు సరఫరా చేయనున్నారు. 1 నుంచి 3 సంవత్సరాల వరకు మొక్కల సంఖ్యకు అనుగుణంగా నిర్వహణ ఖర్చులు ఇవ్వనున్నారు. ఇప్పటివరకు మండలంలో 145 మంది రైతులు పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఎకరన్నరలో బత్తాయి సాగు



నేను మూడెళ్ల క్రితం ఉపాధిహామీ పథకం కింద ఎకరన్నర భూమిలో బత్తాయి తోట సాగు చేశా. లాభదాయకంగా ఉంది. నీటి వసతి పుష్కలంగా ఉండటం వల్లే ఈ తోట వేశాను.

– నందవేని ఐలయ్య, రైతు ఖాసీంపేట

దరఖాస్తు చేసుకోవాలి



పండ్ల తోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలి. 17 మంది 50 ఎకరాల్లో వివిధ తోటల పెంపకానికి డ్రిప్ సౌకర్యం కోసం దరఖాస్తు చేసుకున్నారు.

– స్వాతి, ఉద్యానవన శాఖ నియోజకవర్గ అధికారిణి, మానకొండూర్

పీవీ జిల్లా ఏర్పాటు చేయాలి



ర్యాలీ తీస్తున్న నాయకులు

హుజూరాబాద్: హుజూరాబాద్ పీవీ జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేస్తూ పీవీ జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం పార్టీలకతీతంగా మానవహారం చేపట్టారు. మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, పీవీ జిల్లా సాధన కమిటీ జేఏసీ నాయకుడు వర్ధినేని రవీందర్‌రావు మాట్లాడారు. అన్ని రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ హుజూరాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. జిల్లా ఏర్పడితే ఇక్కడి ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ హనుమకొండలో జరిగే సభలో దీనిపై ప్రకటన చేయాలని కోరారు. కమిటీ నాయకులు ముక్కెర రాజు, పల్కల ఈశ్వర్ రెడ్డి, వేల్పుల రత్నం, పాక సతీశ్, తాళ్లపల్లి శ్రీనివాస్, వెంకటరాజు, ముజాహిద్ హుస్సేన్, శ్రీనివాస్, సదానందం, వెంకట్రాజం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జిల్లాగా ప్రకటించాలి

ఇల్లందకుంట: హుజూరాబాద్‌ను అంబేడ్కర్ జిల్లాగా ప్రకటించాలని జనతాదళ్ సెక్యులర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు అన్నారు. శనివారం ఇల్లందకుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా హడావుడి చేస్తున్న ప్రభుత్వం హుజూరాబాద్ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం హుజూరాబాద్‌ను జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు మనోహర్, రమేశ్‌బాబు, కిరణ్, రవీందర్ తదితరులున్నారు.

‘రోగుల ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్తా’



వైద్యురాలితో మాట్లాడుతున్న సమ్మిరెడ్డి

జమ్మికుంట: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల ఇబ్బందులను మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్తానని జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు తుమ్మేటి సమ్మిరెడ్డి అన్నారు. శనివారం ఆస్పత్రికి వెళ్లి, పరిశీలించారు. వైద్య సిబ్బంది కొరత ఉందని, సమయానికి డాక్టర్లు రాక రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 20 ఏళ్లు ఎమ్మెల్యేగా, ఎనిమిదేళ్లు మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్, 20 నెలలుగా ఎమ్మెల్సీగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి ఆస్పత్రిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దవాఖానాలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దిడ్డి రాము, నాయకులు అవుల తిరుపతి యాదవ్, ఇర్ఫాన్ పాషా, రాఘవేంద్ర, శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని కించపరిచేలా బీజేపీ నాయకులు అనుచిత చేసినందుకు నిరసనగా శనివారం జమ్మికుంట పట్టణంలోని గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. భారత్ జోడో యాత్రకు వచ్చిన ఆదరణ చూసి, ఓర్వలేకనే బీజేపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, ఫొటోలను మార్ఫింగ్ చేస్తున్నారని మండిపడ్డారు. చిల్లర పనులు మానుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, హుజూరాబాద్ నియోజకవర్గ మైనారిటీ సెల్ చైర్మన్ సలీం పాషా, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శి పర్వేజ్, నాయకులు పాల్గొన్నారు.

చొప్పదండి: బీజేపీ అధికార ట్విట్టర్ ఖాతాలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని కించపరిచేలా పోస్టు పెట్టడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ చొప్పదండి పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్ ఆధ్వర్యంలో శనివారం ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పెరుమాళ్ల గంగయ్యగౌడ్, సునీల్, రంగన్న, శంకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

‘అసత్య ప్రచారం మానుకోండి’

రామడుగు: ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ సోషల్ మీడియాలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై చేస్తున్న అసత్య ప్రచారం మానుకోవాలని టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర ద్వారా కాంగ్రెస్‌కు వచ్చిన ప్రజాదరణను చూసి, ఓర్వలేకనే అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

ఒద్యారంను కొత్తపల్లి మండలంలో చేర్చాలి



దీక్ష విరమణ..

గంగాధర: తమ గ్రామాన్ని కొత్తపల్లి మండలంలో చేర్చాలని డిమాండ్‌చేస్తూ గంగాధర మండలంలోని ఒద్యారం గ్రామస్తులు మండల మార్పు సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షను శనివారం కొనసాగించారు. గ్రామస్తులు మండల కేంద్రానికి వెళ్లాలంటే 40 కిలోమీటర్లకు పైగా తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమీపంలోని కొత్తపల్లి మండలంలో చేర్చితే సౌకర్యంగా ఉంటుందన్నారు. సర్పంచ్ సంపత్, ఉపసర్పంచ్ మ్యాక సుజాత, వార్డు సభ్యులు సల్వాజి అంజలి, నర్సింగోజు పద్మ, వడ్లూరి అనిత, గంప మధురమ్మ, సామనపల్లి పావని, సల్వాజి మంజుల, సామల కేతమ్మ, సమితి నాయకులు పాల్గొన్నారు. ఒద్యారం గ్రామస్తుల నిరసన దీక్షను శనివారం సాయంత్రం ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ విరమింపచేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులున్నారు.

బొంతుపల్లిలో జీపీ నిధుల దుర్వినియోగం

వీణవంక: బొంతుపల్లి జీపీ నిధులు దుర్వినియోగమయ్యాయని గ్రామస్తులు పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, స.హ.చట్టం కింద గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులు ఇవ్వాలని కోరుతూ శనివారం కార్యదర్శికి దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీపీలో గతంలో పని చేసిన కారోబార్ అవినీతి ఆరోపణలు ఎదుర్కోగా విధుల నుంచి తొలిగించారని తెలిపారు. కానీ విధులు నిర్వహించని సమయంలోనూ కారోబార్‌కు జీతం చెల్లించాలని పాలకవర్గం తీర్మానించిందని, ఇందుకు సంబంధించిన వివరాలు ఇవ్వాలన్నారు. ఫోర్జరీ బిల్లులు సృష్టించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మాజీ ఉపసర్పంచ్ చదువు జితేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, జున్నూతుల శ్రీనివాస్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, రాజమల్లు, సలీం, నాగయ్య తదితరులు డిమాండ్ చేశారు.

‘నేటి ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభకు రండి’

ఇల్లందకుంట: ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించే ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ ఇన్‌చార్జి జేకే పిలుపునిచ్చారు. శనివారం ఇల్లందకుంట మండల కేంద్రంలో సభకు సంబంధించిన గోడపత్రిక మహాసభ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ బోయిన నారాయణతో కలిసి ఆవిష్కరించారు. నాయకులు మూడెడ్ల శ్రీను, సారంగం, యామ శ్రీను, కొత్త శ్రీను, గొడుగు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ తరలిరావాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొలిపాక తిరుమల్ పిలుపునిచ్చారు. శనివారం వీణవంకలో ఆయన మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మోటం వెంకటేశ్, ఎంఈపీఏ సాంస్కృతిక కళాకారుడు గోనెల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వీణవంక: చల్లూర్ డంపింగ్‌యార్డు వద్ద శనివారం పేకాడుతున్న అదే గ్రామానికి చెందిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఆసిఫ్ తెలిపారు. రూ.5,500 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పల్లెలను గత ప్రభుత్వాలు పట్టించుకోలే

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: మునుపెన్నడూ లేనంతగా గ్రామాలను అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్ మండలంలోని దేవంపల్లి, ముంజంపల్లి గ్రామాల్లో అంబేడ్కర్, మహాత్మాగాంధీ, బతుకమ్మ తల్లి విగ్రహాలను ప్రారంభించారు. సీసీ రోడ్లు, మడేలేశ్వరస్వామి దేవాలయం, గౌడ సంఘం భవనం, పద్మశాలీ సంఘం, ఓపెన్ జిమ్, యాదవ సంఘం భవనం, విశ్వబ్రాహ్మణ సంఘ భవనాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. గత ప్రభుత్వాలు పల్లెలను పట్టించుకోలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ సభ్యుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్‌లు రామంచ గోపాల్‌రెడ్డి, మాదవరం రమ, నాయకులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలను నమ్మొద్దు

గన్నేరువరం: ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీల ఇచ్చే అబద్ధపు హామీలను నమ్మొద్దని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. శనివారం ఖాసీంపేటలో రెడ్డి, అంబేడ్కర్, వివిధ కుల సంఘాల భవనాలకు భూమిపూజ చేశారు. సీసీ రోడ్లు, మానసాదేవి ఆలయ నూతన భవనాన్ని, పీచుపల్లిలో రెడ్డి సంఘం భవనాన్ని ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, ఆర్‌బీఎస్ మండల కో–ఆర్డినేటర్ తిరుపతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకన్న, సర్పంచ్ మల్లీశ్వరి, గ్రామశాఖ అధ్యక్షుడు చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

లంచాలు తీసుకుంటే జైలుకు పంపిస్తాం

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడానికి లంచాలు తీసుకుంటే జైలుకు పంపిస్తామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధర మండలంలోని బూర్గుపల్లి, ర్యాలపల్లి, చర్లపల్లి(ఆర్), కొండయ్యపల్లి, కాచిరెడ్డిపల్లి, కాసారం, తాడిజర్రి, గర్శకుర్తి, ఒద్యారం గ్రామాల్లో రూ.20 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గతంలో ఇక్కడ గెలిచిన స్థానికేతరులు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. స్థానికుడినైన తనకు మరోసారి అవకాశం ఇస్తే అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, పైరవీలు చేసుకున్న వారినే ఎంపిక చేశారని కొండాయిపల్లిలో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేవైఎం నాయకులు



కండువా కప్పుతున్న బాలకిషన్‌రావు

వీణవంక: బీజేవైఎం మండల అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ముఖ్య అనుచరుడు నారాయణదాసు గోపినాథ్ శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వీణవంక మండలంలోని చల్లూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతోపాటు 86వ బూత్ అధ్యక్షుడు గూడెపు శివ, ఉపాధ్యక్షుడు రాము, పలువురు బీజేపీ నాయకులకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వాల బాలకిషన్‌రావు కండువాలు కప్పి, ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోపినాథ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పార్టీలో చేరినప్పటి నుంచి బీజేపీ నాశనమైందన్నారు. ఆయన తన వర్గానికి పదవులు, పనులు ఇచ్చుకుంటూ పాత కార్యకర్తలను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పొదిల రమేశ్, మల్లయ్య, కుమార్ యాదవ్, దండి తిరుపతి, బొంగోని సదానందం, ఫసియొద్దీన్, జక్కు నారాయణ, సంపత్‌రెడ్డి, బొంగోని రాజయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ



చీరలు ఇస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాంశ్యామ్

జమ్మికుంట: శంభునిపల్లిలో శనివారం బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాంశ్యామ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆడపడుచులకు బతుకమ్మ పండుగ సందర్భంగా చీరలు అందించడం గొప్ప కార్యక్రమం అన్నారు. పేదల సంక్షేమం కోసం కృషి చేస్తోందని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ తిరుపతిరావు, సర్పంచ్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, జీపీ కార్యదర్శి మధు, బీఆర్‌ఎస్ నాయకుడు రాజపెల్లి సదయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచ్‌లు శనివారం బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. గట్టుభూత్కూర్‌లో సర్పంచ్ కంకణాల విజయేందర్‌రెడ్డి చీరలు అందజేశారు. రేషన్‌కార్డు ఉన్న ప్రతీ మహిళకు బతుకమ్మ చీరలు వచ్చాయని, డీలర్లను సంప్రదించి తీసుకోవాలని సూచించారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



పరీక్షలు చేయించుకుంటున్న ఎస్సై నరసింహారావు

గన్నేరువరం: లయన్స్ క్లబ్ సేవలు సేవలు అభినందనీయమని ఎస్సై చందా నరసింహారావు అన్నారు. గన్నేరువరంలో శనివారం క్లబ్ జోన్ చైర్మన్ సునీల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆక్యుప్రెషర్ అండ్ మాగ్నెటిక్ చికిత్స వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి, వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఈ శిబిరం మరో నాలుగు రోజులు కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ సభ్యులు కోరారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జువ్వాడి మన్మోహన్‌రావు, క్లబ్ అధ్యక్షుడు కాంతాల కొండల్‌రెడ్డి, ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బూర వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మీసాల ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి గానూ గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ బోటనీ, జువాలజీ బోధించేందుకు ఆయా సబ్జెక్టుల్లో పీజీలో ఓసీ, బీసీ, అభ్యర్థులు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పీహెచ్‌డీ, ఎన్‌ఈటీ, ఎస్‌ఈటీతోపాటు అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు విద్యార్హత ధ్రువపత్రాలతో ఈ నెల 10న సాయంత్రం 4 గంటల్లోగా అకాడమిక్ కో–ఆర్డినేటర్ శ్రీలతను సంప్రదించాలని సూచించారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సైదాపూర్: ఆశవర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జనసేన పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి తగరపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం సైదాపూర్ మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న ఆశవర్కర్లకు ఆయన మద్దతు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు పాడిశెట్టి విజయ్, ప్రధాన కార్యదర్శి మద్ది స్వామి నాయకులున్నారు.

బీజేవైఎం వీణవంక మండల అధ్యక్షుడిగా రాజు

వీణవంక: బీజేవైఎం వీణవంక మండల అధ్యక్షుడిగా శనివారం మల్లన్నపల్లికి చెందిన చింతల రాజును నియమించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన నాయకులకు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

కిసాన్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

గన్నేరువరం: ఈ నెల 9, 10, 11వ తేదీల్లో కరీంనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే కిసాన్ గ్రామీణ మేళా పోస్టర్‌ను శనివారం గన్నేరువరంలో ఆవిష్కరించారు. డెయిరీ, మత్స్యకారులు, గొర్రెల పెంపకం, పౌల్ట్రీ రంగాలకు సంబంధించిన రైతులు, వ్యాపారులకు మూడు రోజులపాటు అవగాహన కల్పించనున్నట్లు బీజేపీ నాయకుడు మునిగంటి సత్తయ్య తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోవోల్టేజీకి పరిష్కారం

జమ్మికుంట: పట్టణంలోని 20వ వార్డులో విద్యుత్ లోవోల్టేజీ సమస్యను విద్యుత్ ఏఈ రమేశ్ పరిష్కరించారు. శనివారం స్తంభాలకు ఐదో లైన్ వేయించారు. పనులను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న, కౌన్సిలర్లు రాధ, నరేశ్ తదితరులు పర్యవేక్షించారు.

కొండపాకలో కేంద్ర బృందం పర్యటన

వీణవంక: కొండపాక హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను జాతీయ నాణ్యతా ప్రమాణాల సూచిక బృందం శనివారం తనిఖీ చేసింది. ఆరోగ్య కార్యక్రమాలు, రికార్డులు, జన ఆరోగ్య సమితి సమావేశాలు, సీజనల్ వ్యాధుల వివరాలు, ఆన్‌లైన్ డాటా, సెంటర్ పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. జిల్లా వైద్యాధికారి లలితాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, వైద్యులు పాల్గొన్నారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోకు తరలివెళ్లిన ఫొటోగ్రాఫర్లు

జమ్మికుంట: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్, ఫొటో టెక్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోకు జమ్మికుంటకు చెందిన ఫొటో, వీడియోగ్రాఫర్లు శనివారం తరలివెళ్లారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర, గౌరవ అధ్యక్షుడు రత్నకుమార్, ముఖ్య సలహాదారు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు అజార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సందీప్ తదితరులున్నారు.